




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 73 | బుధవారం 12 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

### ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు



2

### ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది:

## ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర వ్యాఖ్యలు

- అమెరికా ఆర్థిక మంత్రి వ్యాఖ్యల పై మండిపడ్డ ఇరాన్
- లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా ఆంక్షల అస్త్రాలను ప్రయోగిస్తోందని మండిపాటు
- ఆంక్షల బెదిరింపులతో తమను లొంగదీసుకోలేరని వ్యాఖ్య



2

### డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# భారీ పెట్టుబడులే లక్ష్యం

- సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతి పై నివేదిక కోరిన సీఎం
- వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక
- హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష
- రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



2

## సాగు నీటి ప్రాజెక్టులు

## కట్టింది బుడ్డా కుటుంబం

- మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వెలుగోడు ఆగస్టు 11 వార్త సాక్ష్యం

తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను, వన్ ఆర్, వన్ ఎల్ తూములను, సిద్దాపురం చెరువు ఎత్తిపోతల పథకాన్ని సాధించిన ఘనత బుడ్డా కుటుంబానికి దక్కుతుందని శ్రీశైలం శాసనసభ్యుడు, దివంగత బుడ్డా వెంగళరెడ్డి కుమారుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి, రైతు బాంధవుడు, అపర భగీరథుడు, బుడ్డా వెంగళరెడ్డి 27 వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహన్ని ఆవిష్కరణ చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రైతాంగము బుడ్డా కుటుంబ అభిమానులు వేలాదిగా తరలివచ్చారు.



2

### దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి:

## సీఎం చంద్రబాబు పిలుపు



2

- 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావం పై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

## సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ

- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

2



## రూ. 5వేల కోట్లతో హైదరాబాద్- బెంగళూరు హైవే



2

హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్- 44) విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి విస్తరణ అంశంపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) కీలక అడుగు వేసింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వరకు ప్రస్తుతమున్న 176.37 కిలోమీటర్ల 4 వరుసల రహదారిని 6 లేన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేలా అలైన్‌మెంట్‌ను రూపొందించి కేంద్రానికి పంపింది. రూ. 5వేల కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో బ్రౌన్ ఫీల్డ్ (ప్రస్తుత రోడ్డునే అభివృద్ధి,విస్తరణ చేయడం)విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 12 ఆగష్టు 2026

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకం పై గర్వం, మాతృభూమి పై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారింది: ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర వ్యాఖ్యలు

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పై, ముఖ్యంగా తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించడం అమెరికాకు ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిపోయిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంక్షల ద్వారా ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అంటూ అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. దౌత్య మార్గాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైనప్పుడల్లా అమెరికా ఈ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగిస్తోందని, అవి పనిచేయనప్పుడు మరింత తీవ్రతను పెంచుతూ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దశాబ్దాలుగా ఇరాన్ ప్రజలు అమెరికా విధించిన కఠినమైన ఆంక్షలను తట్టుకుని నిలబడ్డారని, కేవలం ఆంక్షల బెదిరింపులతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం ఎవరికీ సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. అమెరికా నాయకులు ఈ విపరీత ధోరణిని, చెడు అలవాటును ఇలాగే కొనసాగిస్తే, భవిష్యత్తులో దౌత్యపరమైన సంక్షోభాల నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే స్వయం గా నాశనం చేసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను అధిగమించడానికి డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌ల పై ఆధారపడుతోందని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ ఆరోపించారు. ఇరాన్ కొనసాగిస్తున్న అక్రమ ఆర్థిక వ్యవస్థలను గుర్తించి త్వరలోనే పూర్తిగా ధ్వంసం చేస్తామని వెల్లడించారు. ఇంకోవైపు, అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న వేళ ఇరాన్ సైనిక నాయకత్వంలో కీలక నియామకాలు జరిగాయి. దేశ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ తొలిసారిగా మిలిటరీ విభాగంలో ప్రధాన మార్పులు చేశారు. సాయుధ దళాల చీఫ్‌గా మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని, డిప్యూటీ చీఫ్‌గా కియుమర్స్ హైదరీని నియమించారు. అలాగే శక్తివంత మైన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీని, ఆయన డిప్యూటీగా మోస్తఫా ఇజాదీని బాధ్యతల్లోకి తీసుకువచ్చారు. మొజ్తబా ఖమేనీ నాయకత్వంలో జరిగిన ఈ అత్యున్నత స్థాయి నియామకాలు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించు కున్నాయి.

## హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం.. భారీ వర్షాలకు 157 మంది మృతి..

హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటివరకు 157 మంది మృతిచెందగా.. 257 మంది గల్లంతయ్యారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 మధ్య కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 89 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దాదాపు 900 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.886 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం వెల్లడించింది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కుల్లు, మండి జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సుమారు 161 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) వారం రోజులుగా పని చేయడం లేదు. వీటిలో అత్యధికంగా మండిలో 77, సిమ్లాలో 43, కుల్లులో 40 డీటీఆర్‌లు పని చేయకపోవడం తో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల కారణంగా ఏటా కురిసే భారీ వర్షాల మాదిరిగానే ఈ ఏడాదీ వానలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా కుల్లు అంతటా నదులు, వాగుల్లో నీటిమట్టాలు అకస్మాత్తుగా పెరిగాయి. కొండచరియలు విరిగి పడటం, ఆకస్మిక వరదలు ముంచెత్తడం వంటి భయంకరమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అలాగే పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడం వల్ల సుమారు 259 రహదారులు ధ్వంసమయ్యాయి. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన మండిలో 120 రోడ్లు మూతపడగా.. ఆ తర్వాత చంబా-42, కుల్లు-40,సిమ్లాలో 30 చొప్పున రోడ్లు దెబ్బతిన్నాయి. కాగా, రహదారులను పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పని చేస్తుండగా.. వర్షాల కారణంగా ఆటంకం ఎదురవుతోంది. దీనికి తోడు హిమాచల్ ప్రదేశ్ అంతటా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారిక లెక్కల ప్రకారం 54నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఇంత నష్టం జరిగినా హిమాచల్ ప్రదేశ్ కష్టాలు మాత్రం ఇంకా తీరలేదు. కాంగ్రా, మండి, హమీర్‌పూర్, సిమ్లా, సిర్మౌర్ జిల్లాలకు భారీ వర్ష సూచనలు ఉన్నట్లు సిమ్లా ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది.

# డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'.. భారీ పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

# సాగు నీటి ప్రాజెక్టులు కట్టింది బుడ్డా కుటుంబం





తర్వాత జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ 1985లో వెలుగోడు రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారని, తమిళనాడు కు పైపుల ద్వారా నీరు తీసు కువెళ్తామని తమిళనాడు ప్రభుత్వము ప్రతిపాదన చేస్తే, దాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఓపెన్ కెనాల్ ద్వారానే నీరు తీసుకువెళ్లాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామా రావు తేల్చి చెప్పారు. రాయలసీమకు సాగు నీరు అందించిన మహానుభావుడు ఎన్ టి రామారావు. రిజర్వాయర్ మట్టి కట్టకు తూములు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన లేదు. బుడ్డా వెంగళ రెడ్డి రాజీనామా చేస్తానని పట్టుబట్టి, రిజర్వాయర్ యొక్క డిజైన్ మార్చిశీచి,వన్ ఆర్,వన్ ఎల్ తూములు ఏర్పాటు చేసి, వెలుగోడు మండలం లోని 15వేల ఎకరాలు సాగు నీరు అందించిన అపర భగీరథుడు బుడ్డా వెంగళరెడ్డి అన్నారు. సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని అప్పటి ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి శంకుస్థాపన చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఇప్పటివరకు 800కోట్లు తెచ్చాము. పలు సంక్షేమ పథకాలను ప్రారంభించాము విబిఆర్ లోని కాల్వల రిపేర్లు మిగతా పనుల కోసం 18 కోట్లు మంజూరు చేయించాము, త్వరలో పనుల ను ప్రారంభిస్తామని చెప్పారు. కాల్వల రి డిజైన్ కు 10కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. డిఎస్సి పై వైఎస్ఆర్ సీపీ ధర్నా చేయడం సిగ్గు చేటు , వారి పాలనలో ఒక్క డీఎస్సీను విడుదల చేయక పోగా, వైజాగ్‌లో 500 కోట్లు ఖర్చు చేసి ప్యాలెస్ నిర్మించిన ఘనత వారికే దక్కుతుందని విమర్శించా రు.జగన్ ను గెలిపించి తప్పు చేశారు, మళ్ళీ అలాంటి తప్పులు చేయద్దు. వై ఎస్ ఆర్ సి పి కి అవకాశం ఇవ్వొద్దని ఎమ్మెల్యే అన్నారు. 100 కోట్లు సాగు నీటి ప్రాజెక్ట్ లకు మంజూరు చేయించాము. పనులను సంవత్సరంలోపు పూర్తి చేసి రైతంగానికి బాగు చేస్తాం. స్థానిక సంస్థల ఎన్నికలను టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రతిష్టకం గా తీసుకొని గెలిపించు కోవాలి. సిమెంట్ రోడ్స్, పక్కా బిల్డింగ్‌లు, పింఛను ఇస్తున్నా ము డోర్ టూ డోర్‌కు పథకాలను ప్రజలకు వివరిం చాలి. ఓటర్ లిస్ట్ పరిశీలించి, ఓట్లు లేనివారిని తిరిగి చేర్పించి పక్కాగా ఓటర్ల జాబితాను తయారు చేసు కోవాలి. సిద్దాపురం చెరువు వద్ద త్వరలో బుడ్డా వెంగళరెడ్డి పేరిట పార్క్, విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు హరినాథ రెడ్డి, కంచర్ల సురేష్ రెడ్డి, లాయర్ గోవింద రెడ్డి, వంగాల శివరామి రెడ్డి, రామ సుబ్బా రెడ్డి, రజాక్, అమీర్ హంజ, ఎల్లాల కృష్ణుడు, అబ్దుల్లా పురం బాషా, రమణ మాజీ ఎంపీటీసీ, తెలుగు శ్రీనివాసులు ఈదూల చెరువు ప్రెసిండెంట్, తెలుగు గోవిందు, వి.శ్రీనివాసులు, వీర భద్రుడు, మద్దురు శ్రీనివాసులు, ఎల్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి: సీఎం చంద్రబాబు పిలుపు

ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు.

# సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# రూ. 5 వేల కోట్లతో హైదరాబాద్- బెంగళూరు హైవే!

ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వరకు ప్రస్తుతమున్న 176.37 కిలోమీటర్ల 4 వరుసల రహదారిని 6 లేన్ల పాక్షిక యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేలా అలైన్‌మెంట్‌ను రూపొందించి కేంద్రానికి పంపింది. రూ. 5 వేల కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో బ్రౌన్ ఫీల్డ్ (ప్రస్తుత రోడ్డునే అభివృద్ధి, విస్తరణ చేయడం) విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) కూడా తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ చివరి వారంలో కేంద్రానికి పంపే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, రహదారి నిర్మాణ పనులకు టెండర్లను పిలిచే నాటికి అంచనాలు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**గ్రీన్‌ఫీల్డ్ నుంచి బ్రౌన్‌ఫీల్డ్‌కు మారిన రోడ్డు**

నాగ్‌పూర్- హైదరాబాద్ మార్గంలో గ్రీన్‌ఫీల్డ్ విధానంలో హైస్పీడ్ కారిడార్ నిర్మించాలని భావించిన ఎన్‌హెచ్‌ఏఐ ఇందుకు సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించింది. అయితే, ప్రస్తుతం ఉన్న మార్గంతో పాటు ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ మార్గాలపై సమగ్ర సర్వే చేయాలని కేంద్రం మరో సంస్థను నియమించింది. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు 60 మీటర్ల వెడల్పుతో 'రైట్ ఆఫ్ వే' (ఆర్‌వోడబ్ల్యూ) భూమి ఇప్పటికే అందుబాటులో ఉన్నట్లు సదరు సంస్థ తన నివేదికలో స్పష్టం చేసింది. కాబట్టి ఈ స్థలంలోనే ఎలాంటి కొత్త భూసేకరణ అవసరం లేకుండా ప్రస్తుత 4 లేన్ల రహదారిని 6 లేన్లతో యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేయొచ్చని నివేదికలో పొందుపర్చింది. రెండు వైపులా సర్వీస్ రోడ్లనూ సౌకర్యవంతంగా ఏర్పాటు చేయవచ్చని పేర్కొంది. దాంతో కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూసేకరణ చేయడం కంటే.. అందుబాటులో ఉన్న భూమితో బ్రౌన్‌ఫీల్డ్ విధానంలో ముందుకెళ్లాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. ఆ మేరకే తాజాగా ఈ మార్గం అలైన్‌మెంట్‌ను ఖరారు చేసింది.

**ఎంతదూరం ప్రయాణిస్తే అంతే రుసుము**

హైదరాబాద్ (శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపం) కొత్తూరు సమీపం నుంచి కర్నూలు వరకు చేపట్టబోయే 6 లేన్ల విస్తరణకు సంబంధించిన అలైన్‌మెంట్ 'ఆంధ్రజ్యోతి'కి లభించింది. తెలంగాణ పరిధిలో ఈ మార్గం కొత్తూరు, షాద్‌నగర్, బాలానగర్, జడ్చర్ల, భూత్పూర్, అన్నాసాగర్, జానంపేట, మూసాపేట, అడ్డాకల్, కనిమెట్ల, బీచుపల్లి, పుల్లూర్ మీదుగా కర్నూలుకు చేరుకుంటుంది. మొత్తం రహదారిపై 3 చోట్ల టోల్ ప్లాజాలు, 8 మేజర్, 62 మైనర్ జంక్షన్లతో పాటు 10 మేజర్, 74 మైనర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. మొత్తం 86 అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తుండగా.. వీటిలో కొన్ని ఇప్పటికే అందుబాటులో ఉండగా, కొత్తగా ప్రతిపాదించినవి కొన్ని ఉన్నాయి. 3 చోట్ల రైల్వే క్రాసింగ్‌లు రానున్నాయి. ఈ మార్గంలో ఏర్పాటు చేయబోయే 3 టోల్‌ప్లాజాల్లోనూ.. ప్రయాణించిన దూరం మాత్రమే రుసుము చెల్లించేలా కొత్త సాంకేతికతను వినియోగించనున్నారు. వాహనం హైవే పైకి ఎక్కిన చోట, దిగిన చోట ఉండే ఆటోమేటిక్ స్కానర్లు ప్రయాణించిన దూరాన్ని లెక్కించి నేరుగా ఫాస్టాగ్ నుంచి రుసుమును మినహాయించుకుంటాయి. ప్రస్తుత రహదారిపై గంటకు 80 కిలో మీటర్ల వేగానికి అనుమతి ఉండగా.. విస్తరణ అనంతరం వాహనాలు గంటకు 100-120 కి.మీ వేగంతో ప్రయాణించేందుకు వీలవుతుంది. హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణ సమయం గరిష్ఠంగా తగ్గనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

VARTHAA SAKSHAMU
వార్త సాక్షం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

బుధవారం 12 ఆగష్టు 2026

# సంపాదకీయం

# అంతిమ పరిష్కారం-'నీట్' రద్దు!

## కాలేజీల్లో కాదు, చట్టసభల్లోనే అసలు నేరస్థులు!



నిజమైన విద్రోహం ఎక్కడుంది? దేశ భవిష్యత్తును ప్రశ్నిస్తూ వీధుల్లోకి వచ్చిన విద్యార్థుల ఆలోచనల్లో ఉందా? లేక ప్రజల తరఫున చట్టాలు చేయాల్సిన పార్లమెంట్, అసెంబ్లీలను నేరాల నుంచి తప్పించుకునే కవచాలుగా మార్చుకున్న రాజకీయ నాయకుల్లో ఉందా?కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను పాలకులు, వారి అనుయాయులు 'క్రిమినల్స్', 'దేశద్రోహులు', 'విద్రోహశక్తులు'గా ముద్రవేశారు. ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసు బలగాలు, కేసులు, అరెస్టులు, ప్రచార యంత్రాంగం-- అన్నింటినీ రంగంలోకి దించారు. కానీ అదే సమయంలో అసలు నేర చరిత్ర కలిగినవారు ఎక్కడ ఉన్నారన్న ప్రశ్నను పూర్తిగా పక్కన పెట్టేశారు.

దేశాన్ని కాపాడాల్సిన చట్టసభల్లోనే నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు ఉండటం ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు. ఉద్యమం చేస్తున్న యువతను నేరస్థులుగా చిత్రీకరించడం కంటే ఇది మరింత ప్రమాదకరమైన వాస్తవం.

ప్రజాస్వామ్య దేవాలయాలుగా భావించే పార్లమెంటు, శాసనసభల వేదికలపై ప్రజాప్రతినిధులుగా వెలుగుతున్న వారి అసలు రంగు ఏమిటో తాజా గణాంకాలు నిగ్గు తేలుస్తున్నాయి. పవిత్రమైన శాసనాలు చేసే స్థానాల్లో క్రిమినల్ కేసులు ఉన్నవారు, హత్య, హత్యాయత్నం, మహిళలపై దాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు సురక్షితంగా కొలువై ఉన్నారు. ప్రజాప్రతినిధుల నేర చరిత్రను ప్రశ్నించని పాలకులు... ప్రశ్నించే విద్యార్థులపై మాత్రం క్రిమినల్ ముద్ర వేయడం కంటే దుర్మార్గం మరొకటి ఉంటుందా?

అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదికల ప్రకారం, భారత పార్లమెంటులోని రాజ్యసభలో 31శాతం మంది సభ్యులు (69 మంది) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు స్వయంగా అఫిడవిట్లలో వెల్లడించారు. వీరిలో 16శాతం మంది (36 మంది) హత్య, హత్యాయత్నం, మహిళలపై దాడుల వంటి అత్యంత తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నవారే.

లోక్‌సభలోనైతే ఏకంగా 46శాతానికి పైగా ఎంపీలు క్రిమినల్ కేసులను మోస్తున్నారు. 2009తో పోలిస్తే తీవ్రమైన నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల సంఖ్య రెట్టింపు కావడం మన రాజకీయ వ్యవస్థ ఎటువైపు పయనిస్తోందో సూచిస్తోంది.

రాష్ట్ర శాసనసభల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. దేశవ్యాప్తంగా 45 శాతం మంది ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసులలో నిందితులుగా ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో ఈ సంఖ్య 50 శాతానికి పైగా ఉంది. చట్టాలను రూపొందించాల్సిన స్థానాల్లో కూర్చున్నవారే చట్టాన్ని ఉల్లంఘించిన ఆరోపణల్లో మునిగి తేలుతుంటే, ఆ స్థానాల పవిత్రత ఏమవుతోంది? న్యాయస్థానాల్లో ఏళ్లకు ఏళ్లు సాగే విచారణ జాప్యాన్ని, తమకున్న ధనబలాన్ని, అంగబలాన్ని వాడుకుని వారు శిక్షల నుంచి తప్పించుకుంటూ చట్టసభలను కవచాలుగా మార్చుకుంటున్నారు. ఈ నేర చరిత్ర కలిగిన నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవస్థలను, విధాన నిర్ణయాలను దెబ్బతీస్తున్నారు. రాజకీయాల్లోకి నేరస్థులు రావటం వెనుక కోట్లాది రూపాయల ధనబలం దాగి ఉంది. రాజ్యసభ ఎంపీలలో 14శాతం మంది బిలియనీర్లు ఉన్నారు. అధికారం, సంపద, నేరం ముడిపడి ఉన్న ఈ రాజకీయ వ్యూహంలో కేవలం గెలుపే ప్రామాణికంగా రాజకీయ పార్టీలు క్రిమినల్స్‌కు టికెట్లు కేటాయిస్తూ, పవిత్ర చట్టసభలను నేరస్థుల అభయారణ్యాలుగా మారుస్తున్నాయి.

ఈ దారుణ సత్యాన్ని కప్పిపుచ్చే ందుకే, పాలకులు తమ దృష్టిని ప్రశ్నించే గొంతులపైకి మళ్లిస్తున్నారు. ఇంతటి తీవ్ర నేరచరిత్ర కలిగిన నాయకులకు పీఠాలు వేస్తూ, సముచిత గౌరవాలు అందిస్తున్న పాలకులు, సమాజంలో అన్యాయాన్ని నిలదీసే విద్యార్థులపై మాత్రం ఉక్కుపాదం మోపుతు న్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకు, రాజ్యాంగ బద్ధమైన నిరసనలను నేరాలుగా చిత్రీకరించేందుకు రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ దుర్వినియోగం చేస్తున్నారు. తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం పోరాడే విద్యార్థుల చేతుల్లో ఉన్నది పుస్తకాలు, మనసులో ఉన్నది ప్రజాస్వామ్య కాంక్ష. కానీ చట్టసభలను ఏలుతున్న వారి వెనుక ఉన్నది అపరిమితమైన సంపద, అడ్డూ అదుపూ లేని నేరచరిత్ర! వోహ్రా కమిటీ నివేదిక నుంచి సుప్రీంకోర్టు తీర్పుల వరకు ఎన్నో హెచ్చరికలు చేసినా, పొలిటికల్ పార్టీలు గెలుపే ప్రామాణికంగా నేరచరిత్ర ఉన్నవారికే టికెట్లు కట్టబెడుతున్నాయి. ఈ నేరమయ రాజకీయాల వల్ల ప్రజాస్వామ్య పునాదులు కదిలిపోతున్నాయి. చట్టసభల్లో నేరస్థులను కూర్చోబెట్టుకుని, వీధుల్లో పోరాడే విద్యార్థులపై నేర ముద్ర వేసే పాలకుల నైతికతను పౌర సమాజం నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది.






ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పేరుతో జెన్ జీ యువత, విద్యార్థులు ఇటీవల ఒక అపూర్వ నిరసన చేపట్టారు. ఆ ఆందోళన ఫలితంగా కాలవాహినిలో మరుగున పడిన వివిధ అంశాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. వాటిలో ఒకటి-- 'నీట్' రద్దు; మరొకటి-- 'విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్రాల జాబితాలోకి తిరిగి చేర్చడం'.వైద్యవిద్యా కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే 'నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటి నుంచీ అది వివాదాస్పదంగానే ఉన్నది. వైద్య విద్యలో శిక్షణ కోసం రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల వల్ల అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో పాటు విద్యార్థులపై విపరీతమైన ఆర్థిక భారం పడి, వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నందున జాతీయ స్థాయిలో ఒకే విధమైన ప్రవేశ పరీక్ష ఉండాలని కొందరు నిపుణులు సూచించారు. వైద్య విద్యలో ప్రవేశించడానికి అవసర మయ్యే అర్హతా పరీక్ష జాతీయ స్థాయిలో ఒకేవిధంగా ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సైతం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచనల మేరకు కేంద్రం 2013లో వైద్య విద్యకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టింది. అయితే, అప్పటి నుంచి ఈ ఏడాది వరకు 5 సార్లు 'నీట్' నిర్వహణలో పలు అక్రమాలు సంభవించాయి. ఆ అవకతవకలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. వైద్య ప్రవేశ పరీక్షను పూర్తిగా రద్దు చేసి తిరిగి నిర్వహించిన సందర్భాలు... గతంలో 2015లో AIPMT విషయంలో, తాజాగా 2026లో నీట్ విషయంలో చోటుచేసుకున్నాయి. ఇది గమనార్హమైన వాస్తవం. 'నీట్'కు ప్రతి ఏటా హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య సగటున 21 లక్షలు ఉంటుండగా, వారిలో 11 నుంచి 13 లక్షల మంది దాకా అర్హత సాధిస్తున్నారు. వీరిలో కేవలం 1 లక్షా 10 వేల నుంచి 1 లక్షా 25 వేల మంది వరకూ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం పొందుతున్నారు. అంటే, 'నీట్' రాసిన వారిలో సీట్లు పొందేవారి సంఖ్య కేవలం 6 శాతంగా మాత్రమే ఉంటోంది.

విధానపరంగా చూసినప్పుడు జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించడం అన్నది సముచితంగా కనిపిస్తోంది. అయితే 'నీట్' నిర్వహణలో అనేక లోపాలు, వైరుధ్యాలు ఉన్నాయనేది ఒక వాస్తవం. లక్షలాది విద్యార్థుల జీవితాలతో ముడివడి ఉన్న 'నీట్'ను లోపరహితంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది (2026) 'నీట్' పరీక్ష రద్దు కావడంతో 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జీవితాన్ని పణంగా పెట్టి కష్టపడి చదివే విద్యార్థులకు పేపర్ లీకేజీ వంటి అక్రమాలు అశనిపాతంగా పరిణమిస్తున్నాయి. పరీక్ష రద్దు కావడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికిలోనై కుప్పకూలిపోతున్నారు. రెండోసారి ఫీజు లేకుండా పరీక్ష నిర్వహించి నప్పటికీ.. అందుకు చాలామంది విద్యార్థులు సన్నద్ధం కాలేకపోవడం ఓ చేదు వాస్తవం.'నీట్'ను రద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహి స్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యా ప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నాయంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది. 'నీట్'నురద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహిస్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నా యంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది.

'నీట్'లో మరో కీలకమైన లోపం ఏమంటే ప్రశ్న పత్రాన్ని 'సీబీఎస్ఈ' సిలబస్‌ను ఆధారం చేసుకొని రూపొందిస్తున్నారు. విద్యార్థుల్లో అత్యధికులు తమ రాష్ట్రంలో అమలు చేసే రాష్ట్ర సిలబస్‌ను మాత్రమే చదువుతారు. అంటే, 'నీట్'కు హాజరవుతున్న సీబీఎస్ఈ సిలబస్ విద్యార్థులకు ఇతరుల కంటే అదనపు ప్రయోజనం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'నీట్' రద్దు చేయాలని మొదటి నుంచీ పలు విధాలా పోరాటం చేస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం '2021లో వైద్య విద్యా ప్రవేశాలపై ఆ జాతీయ ప్రవేశ పరీక్ష ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి 'ఏకే రాజన్' కమిటీని ఏర్పాటు చేసింది. కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేవారికే 'నీట్'లో దాదాపు 90 శాతం సీట్లు లభిస్తున్నాయని, 'నీట్' అన్నది వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిందని, మెడికల్ డాక్టర్ కావాలనుకుంటున్న పేద, వెనుకబడిన వర్గాల హక్కులను, ప్రయోజనాలను ఇది కాలరాస్తోందని ఏకే రాజన్ కమిటీ నివేదిక వెల్లడించింది. మరి ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే సర్వత్రా చర్చకు వస్తోంది: 'విద్య అన్నది విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం నేర్చుకునేదా? లేక విజ్ఞానం, నైపుణ్యాలు సముపార్జించి, తద్వారా ఉపాధి పొందే మార్గంగా ఎంచుకునేదా?' 'నీట్' పరీక్ష లేనప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యన భ్యసించి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడి ప్రసిద్ధ వైద్యులుగా భారతీయులు ఎంతో పేరు గడించారని కొందరు గుర్తు చేస్తున్నారు. గల్ఫ్ దేశాలలో, ఇంగ్లాండ్‌లో ఉన్న వైద్యులలో 20శాతం మంది భారతీయులేనని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతేకాదు, 'నీట్' మొదలయ్యాక గత కొన్నేళ్లుగా దేశంలో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులలో తగిన ప్రమాణాలు లేవన్న విమర్శ కూడా వినిపిస్తోంది.

పలు రాష్ట్రాలు, ప్రత్యేకించి ఈశాన్య ప్రాంత రాష్ట్రాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన బిహార్, రాజస్థాన్ మొదలైనవి కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగి స్తున్నాయి. ఈ రాష్ట్రాలపై ఆర్థిక భారం తగ్గించడం కోసమే కీలకమైన 'విద్య'ను రాష్ట్రాల జాబితా నుంచి తొలగించి 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం ఇతోధికంగా రాష్ట్రాలకు నిధులు అందిస్తూ వస్తోంది. ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం 'సర్వశిక్షా అభియాన్' వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే, దేశంలో ప్రతి రాష్ట్రానికీ తమదైన ప్రత్యేక భాషా సంస్కృతులు ఉన్న నేపథ్యంలో స్థానిక అవసరాల రీత్యా అవసరమైన విద్యా వ్యవస్థను, విద్యా విధానాన్ని తమకు తాముగా రూపొందించుకునే స్వేచ్ఛ కోసం విద్యను రాష్ట్ర జాబితాకు బదలాయించాలని తమిళనాడు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఈ డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమాఖ్యవాద సూత్రాన్ని 'నీట్' ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ, ఆ జాతీయ ప్రవేశ పరీక్ష రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విద్యా విషయమై నిర్ణయాలు తీసుకునే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని 'నీట్' హరించివేస్తోందని కూడా ఆ పిటిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా.. 'నీట్' పరీక్ష గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్ర బోర్డు విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నది కనుక అది రాజ్యాంగ అధికరణ 14 (చట్టం ముందు అందరూ సమానులే) ప్రకారం సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోందని కూడా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఇంకా తుది తీర్పు వెలువరించలేదు. కేంద్రం, రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి రాజ్యాంగ అధికరణ 131 సుప్రీంకోర్టుకు అధికారాలు కల్పించింది. ఈ నేపథ్యంలో, సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రాలకు అనుకూలంగా ఉండవచ్చునే అభిప్రాయం న్యాయ వ్యవస్థ వర్గాలలో వ్యక్తమవు తోంది. అమెరికాతోపాటు పలు దేశాలలో విద్యను స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రస్థాయి ప్రభుత్వాలే నిర్వహి స్తున్నాయి. ఫెడరల్ ప్రభుత్వాలు విద్యలో జోక్యం చేసుకోవు.

మన దేశంలో కూడా విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చ వలసిన అవసరమున్నది. దీనివల్ల రాష్ట్రాలు గతంలో వలే తమ సొంత విధానాలు, ప్రమాణా లను నిర్ణయించుకోవడానికి, స్వయం ప్రతిపత్తితో పనిచేయడానికి అవకాశం లభిస్తుంది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ప్రస్తుతం దేశవ్యా ప్తంగా ఉన్న విద్యార్థులకు 'నీట్' వల్ల ఒకే ఒక్క అవకాశం ఉంటోంది. వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తే ఇతర రాష్ట్రాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు వెళ్లే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. విభిన్న నేప థ్యాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రతిభకు అన్యాయం జరగదు. సామాజిక న్యాయానికి భంగం వాటిల్లదు. అదేవి ధంగా తక్కువ ప్రాతినిధ్యం ఉన్న సామాజిక వర్గాలకు రాజ్యాంగ పరంగా లభించిన రిజర్వేషన్ విధానం రాష్ట్రాల స్థాయిలో సమర్థంగా అమలవు తుంది. అంతేకాకుండా రాజ్యాంగం ప్రవచించిన సమాఖ్య విధానం పటిష్ఠమవడమే కాకుండా కేంద్ర రాష్ట్ర సంబంధాలు సామరస్యంగా ఉంటాయి. అందువల్ల నీట్ పరీక్షను రద్దు చేయడం, విద్య అంశాన్ని రాష్ట్రాల జాబితాకు బదలాయించడం అన్ని విధాలా శ్రేయస్కరం.

# స్తంభాలు వేశారు.. వైర్లు మరిచారు...!

-అర్బన్ కాలనీలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం సిపిఎం

ఆత్మకూరు ఆగస్టు 11 వార్త సాక్ష్యం

మూడేళ్లుగా 'మొండి' స్తంభాలే దిక్కు.రాత్రివేళల్లో అల్లాకల్లోలం కరెంట్ స్తంభాలొచ్చాయి. కాంతి ఏదీ అంధకారంలో ఆత్మకూరు అర్బన్ కాలనీ వాసులు అధికారుల'వెంటనే విద్యుత్ తీగలు వేయాలి'అని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, పట్టణ నాయకులు, డి.రామ్ నాయక్, శాఖ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ లు డిమాండ్ చేశారు మంగళవారం కొత్త స్తంభాలు వేసి.. వదిలేసిన వైనం వెంటనే విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలి అని ఆత్మకూరు అర్బన్ కాలనీలో సిపిఎం పార్టీగాస్థానికులతో కలిసి నిరసన తెలుపడం జరిగింది.ఈ సందర్బంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీలో అధికారుల నిర్లక్ష్యం కాంతి రేఖలను అంధకారంలో ముంచెత్తు తోంది. కాలనీలోని మాబు ఇంటి వద్ద నుంచి టైలర్ రషీద్ ఇంటి వరకు, అక్కడి నుంచి గౌండ బుడంస ఇంటి వరకు విద్యుత్ స్తంభాలు నాటి ఏకంగా మూడేళ్లు గడుస్తున్నా. నేటికీ వైర్లు ఏర్పాటు చేయకపోవడం అటకెక్కించిన పాలనకు అద్దం పడుతోంది.స్తంభాలు వేసి అధికారులు చేతులు దులుపుకోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాఢాంధకారంలో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే ప్రజలు, ముఖ్యంగా మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఈ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం నాటి నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కాలనీవాసులు విరుచుకుపడ్డారు. "విద్యుత్ తీగలు లేని స్తంభాలు కాలనీలో మొండి గోడల్లా దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు సంచరించే ఈ వీధుల్లో చీకటి కారణంగా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యత ఎవరిది అని ఘాటుగా ప్రశ్నించారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల కాలనీవాసులకు నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని మండిపడ్డారు. అర్బన్ కాలనీలోని మొండి స్తంభాలకు



తక్షణమే విద్యుత్ తీగలు (వైర్లు) అమర్చి, వీధి దీపాలు వెలిగించాలి.చీకటి సాకుగా భావించి అపశ్రుతులు జరగకముందే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలి.లేకపోతే కాలనీ ప్రజలతో కలిసి విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, రమీజాబీ, ముబీన, మెహరూన్ బి,హుస్సేన్ బి, రేష్మ,రెహానా , సమీర్,షేక్షా,మా భాష, టైలర్ రషీద్, అన్వర్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీటి ప్రాజెక్టులు కట్టింది బుడ్డా కుటుంబశీ





-మాజీమంత్రిబుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వెలుగోడు ఆగస్టు 11 వార్త సాక్ష్యం

తెలుగు గంగ ప్రాజెక్టులో భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను , వన్ ఆర్, వన్ ఎల్ తూములను , సిద్దాపురం చెరువు ఎత్తిపోతల పథకాన్ని సాధించిన ఘనత బుడ్డా కుటుంబానికి దక్కుతుందని శ్రీశైలం శాసనసభ్యుడు , దివంగత బుడ్డా వెంగళరెడ్డి కుమారుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి , రైతు బాంధవుడు , అపర భగీరధుడు, బుడ్డా వెంగళరెడ్డి 27 వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహన్ని ఆవిష్కరణ చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రైతాంగము బుడ్డా కుటుంబ అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. తర్వాత జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ 1985 లో వెలుగోడు రిజర్వాయర్ కు శంకుస్థాపన చేశారని , తమిళనాడు కు పైపుల ద్వారా నీరు తీసుకువెళ్తామని తమిళనాడు ప్రభుత్వము ప్రతిపాదన చేస్తే, దాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఓపెన్ కెనాల్ ద్వారానే నీరు తీసుకువెళ్లాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తేల్చి చెప్పారు.రాయలసీమ కు సాగు నీరు అందించిన మహానుభావుడు ఎన్ టి రామారావు.రిజర్వాయర్ మట్టి కట్టకు తూములు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన లేదు. బుడ్డా వెంగళరెడ్డి రాజీనామా చేస్తానని పట్టుబట్టి , రిజర్వాయర్ యొక్క డిజైన్ మార్చిశీచి , వన్ ఆర్ , వన్ ఎల్ తూములు ఏర్పాటు చేసి, వెలుగోడు మండలంలోని 15 వేల ఎకరాలు సాగు నీరు అందించిన అపర భగీరథుడు బుడ్డా వెంగళరెడ్డి అన్నారు. సిద్దాపురం ఎత్తిపోతల పథకాన్ని అప్పటి ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి శంకుస్థాపన చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఇప్పటివరకు 800 కోట్లు తెచ్చాము. పలు సంక్షేమ పథకాలను ప్రారంభించాము విబిఆర్ లోని కాల్వల రిపేర్లు మిగతా పనుల కోసం 18 కోట్లు మంజూరు చేయించాము, త్వరలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు.కాల్వల రి డిజైన్ కు 10కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. డి ఎస్సి పై వైఎస్ఆర్ సీపీ ధర్నా చేయడం సిగ్గు చేటు , వారి పాలనలో ఒక్క డీఎస్సీను విడుదల చేయకపోగా , వైజాగ్ లో 500 కోట్లు ఖర్చు చేసి ప్యాలెస్ నిర్మించిన ఘనత వారికే దక్కుతుందని విమర్శించారు. జగన్ ను గెలిపించి తప్పు చేశారు , మళ్ళీ అలాంటి తప్పులు చేయద్దు. వై ఎస్ ఆర్ సి పి కి అవకాశం ఇవ్వొద్దని ఎమ్మెల్యే అన్నారు. 100 కోట్లు సాగు నీటి ప్రాజెక్ట్ లకు మంజూరు చేయించాము. పనులను సంవత్సరం లోపు పూర్తి చేసి రైతంగానికి బాగుచేస్తాం. స్థానిక సంస్థ ల ఎన్నికలను టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రతిష్టకంగా తీసుకొని గెలిపించు కోవాలి. సిమెంట్ రోడ్స్ , పక్కా బిల్డింగ్ లు , పించను ఇస్తున్నాము.. డోర్ టూ డోర్ కు పథకాలను ప్రజలకు వివరించాలి. ఓటర్ లిస్ట్ పరిశీలించి , ఓట్లు లేనివారిని తిరిగి చేర్పించి పక్కాగా ఓటర్ల జాబితాను తయారు చేసుకోవాలి. సిద్దాపురం చెరువు వద్ద త్వరలో బుడ్డా వెంగళరెడ్డి పేరిట పార్క్ , విగ్రహం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి సీనియర్ నాయకులు హరినాథ రెడ్డి , కంచర్ల సురేష్ రెడ్డి , లాయర్



వెలుగోదు : బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే.

గోవిందరెడ్డి , వంగాల శివరామి రెడ్డి , రామసుబ్బారెడ్డి , రజాక్ , అమీర్ హంజ , ఎల్లాల కృష్ణుడు , అబ్దుల్లాపురం బాషా, రమణ మాజీ ఎంపీటీసీ , తెలుగు శ్రీనివాసులు ఈదూల చెరువు ప్రెసిండెంట్,తెలుగు గోవిందు, వి . శ్రీనివాసులు, వీరభద్రుడు, మద్దురు శ్రీనివాసులు, ఎల్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలికి నివాళులర్పించిన కోన రఘుపతి

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం

మాజీ జడ్పీటీసీ మరుప్రోలు శివారెడ్డి తల్లి మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. .మృతురాలి సేవలను, కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ, కుటుంబంలో పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని



ప్రార్థించారు.కోన రఘుపతితో పాటు ప్రముఖ వ్యాపారవేత్త పేరాల వెంకట సురేష్, యువజన అధ్యక్షుడు సాగర్, అలా రవి, పరమానంద కుమార్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు, అభిమానులు, శివారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రతిభ

ముండ్లమూరు ఆగస్టు 11వార్త సాక్ష్యం

ఒంగోలు జోన్‌లో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో మారెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలవిద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-17 బాలుర ఖో-ఖో విభాగంలో పూరిమెట్ల మణికంఠ, అండర్-17 హైజంప్ విభాగంలో ప్రవళిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ప్రతిభపై పాఠశాల హెచ్‌ఎం కె. శ్రీనివా సరావు, పీడీ పద్మలత, విద్యా కమిటీ చైర్మన్ పి. యల్లయ్య అభినందనలు తెలిపారు.



## పాములపాడు కేజీబీవీ లో విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు

-డాక్టర్ పి.షేక్షావలి



పాములపాడు ఆగస్టు-11 వార్త సాక్ష్యం

పాములపాడు మండలంలోని, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారము జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు పి.షేక్షావలి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని, 275 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 43 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన, వారికి ఉచిత కళ్లఆద్దాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు పి.షేక్షావలి మాట్లాడుతూ ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఇతర డిజిటల్ పరికరాలను ఎక్కువసేపు చూడకుండా పరిమితంగా వినియోగించాలని, మొబైల్ ఫోన్‌ను కళ్లకు దగ్గరగా పెట్టుకుని చూడకూడదని సూచించారు. చదువుకునే సమయంలో సరైన వెలుతురు ఉండేలా చూసుకోవడంతో పాటు, కళ్లకు తగిన విశ్రాంతి ఇవ్వాలని తెలిపారు. కంటి ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు లభించే ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు, వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కళ్లలో ఇబ్బందులు, చూపు మందగించడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త మాధవి, ఆశా కార్యకర్త దేవమణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన జానంపేట సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి

భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 11 వార్త సాక్ష్యం



జిల్లా,లో ని పినపాక మండలం జానంపేట గ్రామానికి చెందిన గండెం లక్ష్మి అనే మహిళకు ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) 60, 000/- విలువ గల చెక్కును మంగళవారం అందజేశారు. పినపాక శాసనసభ్యుల పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, పినపాక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు సూచనలతో జానంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి, ఉప సర్పంచ్ దాట్ల రాజేష్ చేతుల మీదుగా ఈ చెక్కును బాధితురాలికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. వైద్య ఖర్చులు, ఇతర అత్యవసర సమయాల్లో సీఎంఆర్ఎఫ్ నిధులు పేదలకు ఎంతో ఊరట కలిగిస్తాయని పేర్కొన్నారు. అనంతరం చెక్కును అందుకున్న లక్ష్మి మాట్లాడుతూ... కష్టకాలంలో తనకు ఆర్థిక సహాయం అందించి నందుకు స్థానిక శాసనసభ్యులకు, ప్రజాప్రతినిధులకు మరియు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉంటానని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుకు రైతు మృతి

కర్లపాలెం ఆగస్టు 11వార్త సాక్ష్యం



పొలం పనుల్లో నిమగ్నమైన ఓ రైతు త్రాచుపాము కాటుకు గురై మృతి చెందిన విషాద ఘటన యాజలి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాసాని శ్రీనివాసరావు (45) సోమవారం పొలం పనుల్లో భాగంగా కాలువ గట్లను సరిచేస్తుండగా పొదల్లో ఉన్న త్రాచుపాము ఒక్కసారిగా కాటేసింది. దీంతో శ్రీనివాసరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆగస్టు 11వార్త సాక్ష్యం విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే శ్రీనివాసరావును సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ అప్పటికే విష ప్రభావం శరీరమంతా వ్యాపించడంతో పరిస్థితి విషమించింది. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శ్రీనివాసరావు మృతి చెందాడు.రైతు మృతితో యాజలి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. పాముకాటు ఘటనలు చోటుచేసుకున్నప్పుడు ఆలస్యం చేయకుండా బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించాలని పలువురు పేర్కొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


## ఘనంగా పోలేరమ్మ తల్లి ఘటాభిషేకం



బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం

పట్టణంలోని శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో సాహస్ర ఘటాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ఘటస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాహస్ర ఘటాభిషేకం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## శక్తి యాప్‌పై విద్యార్థినులకు పోలీసుల అవగాహన




చీరాల ఆగస్టు 11వార్త సాక్ష్యం

మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ సూచనలతో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో శ్రీ గౌతమి కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు విద్యార్థినులకు శక్తి యాప్, ూూ సదుపాయం, 112 అత్యవసర నంబర్ వినియోగంపై వివరించారు. ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే శక్తి యాప్ ద్వారా లేదా 112కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్సై హరిబాబు తెలిపారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళల గౌరవం, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, వేధింపులు లేని సురక్షిత విద్యా వాతావరణం కోసం అందరూ సహకరించాలని శక్తి బృందం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వరప్రసాద్, కరస్పాండెంట్ ఎం.సి.హెచ్. వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పార్టీ నేతను పరామర్శించిన ఎమ్మెల్యే

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సంగుపాలెం మాజీ సర్పంచ్ జాలాది లోకారాయుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు వెంటనే స్పందించి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకారాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లోకారాయుడు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకుడిగా లోకారాయుడు అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయన పూర్తిగా కోలుకుని మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజల కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. లోకారాయుడు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

# విద్యార్థులు మహిళల రక్షణ కోసమే శక్తి యాప్





-చట్టాలపై అవగాహన కల్పించుకోవడంలో ముందుండాలి

-ఆదిత్య కళాశాల విద్యార్థులతో శక్తి యాప్ పై విద్యార్థులతో సమావేశం

-పాములపాడు ఏఎస్ఐ, షేక్. నూర్ అహమ్మద్

ఆత్మకూరు ఆగస్టు 11వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ “ శక్తి యాప్ టీం “ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలతో ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ . మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణ లో ఆత్మకూరు “ శక్తీ టీం “ సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, సుప్రియ ల సహకారంతో మంగళవారం పట్టణం లోని ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్ నాయుడు ఆధ్వర్యంలో కాలేజ్ విద్యార్థినీ, విద్యార్థులకు“ శక్తీ యాప్ పై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శక్తి టీం ఎస్ఐ షేక్ నూర్ అహ్మద్ మాట్లాడుతూ “ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన “ శక్తి యాప్ “ గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం అయినది, సార్. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా మీరు మంచి క్రమశిక్షణ తో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను “ ఈవిటీజింగ్ “ పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే ఏ మాత్రం అధైర్య పడకుండా, మీకు భరోసాను మరియు ధైర్యాన్ని ఇచ్చే మీకు రక్షణ ఉండేలాగా మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తీ యాప్ ను ఉపయోగించి 112 కు గానీ 1098 కి గానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని అవేర్నెస్ చేసినాము. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపకూడదని తెలియజేశారు చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని. చదువు ఒక్కటే మిమ్మల్ని




సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మార్చేది చదువు ఒక్కటే అని తెలుపుతూ.. అదేవిధంగా మీ ఇంట్లోని మీ పేరెంట్స్ మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా “ హెల్మెట్ “ పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు నాన్న,అన్నా,బాబాయి,మేనమామ లు ఎవ్వరైనా సరే మద్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచిస్తూ...త్రాగి వాహనం నడిపి పోలీస్ సార్వాళ్ళకు చిక్కి కేసు పెట్టి కోర్టు కు పంపిస్తే కోర్టు జడ్జి వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అని విద్యార్థిని విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బాలింతలకు భరోసా.. బిడ్డలకు రక్షణ

-పేదలకు ఉచిత వైద్య రవాణా

-బాలింతలు, శిశువులకు సురక్షిత ప్రయాణం

-నూతన వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ , కొండయ్య

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం

బాలింతలు, పసిపాపలను ఆసుపత్రుల నుంచి సురక్షితంగా ఇళ్లకు చేర్చడంతో పాటు పేదలకు ఉచిత వైద్య రవాణా సేవలను మరింత చేరువ చేసేందుకు ‘తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్’ (102) నూతన వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. బాపట్ల ఏరియా వైద్యశాలలో ఎమ్మెల్యేలు వాహనాలను ప్రారంభించారు. బాపట్ల ఏరియా వైద్యశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్’ (102) వాహనాలను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ మద్దులూరి మాలకొండయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి సేవలను ప్రారంభించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా 102 వాహనాన్ని నడిపి, అందులో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. బాలింతలు, నవజాత శిశువులకు ప్రయాణ సమయంలో అందుతున్న సౌకర్యాలు, వాహనంలో ఉన్న వైద్యపరమైన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రసవం పొందిన బాలింతలు, పసిపాపలను క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడంలో 102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకోవడం ఆర్థికంగా భారంగా మారకుండా ఈ ఉచిత రవాణా సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రసవం అనంతరం తల్లి, శిశువుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో సురక్షితమైన రవాణా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు తల్లీబిడ్డల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన 102 వాహనాలను బాలింతలు, నవజాత శిశువులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. అవసరమైన సమయంలో ఈ సేవలను వినియోగించుకుని తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇళ్లకు చేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, ఏరియా వైద్యశాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతి నిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ పంటలే మేలు

ముండ్లమూరు ఆగస్టు 11వార్త సాక్ష్యం

తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎ. తిరుమలరావు సూచించారు. ముండ్లమూరు మండలంలోని నూజల్లపల్లి, శంకరాపురం గ్రామాల్లో నిర్వహించిన ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కొర్రలు, సజ్జలు, సామలు, పెసర, మినుములు, అలసందలు, ఉలవలు, నువ్వులు, ఆముదం, వేరుశెనగ, మునగ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు పంట బీమా చేయించుకోవాలని కోరారు. కౌలు రైతులు సంబంధిత వీఆర్వోను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని దర్శి సబ్‌డివిజన్ టెక్నికల్ వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. అనంతరం పీఎండీఎస్ విత్తనాలు వేసిన పొలాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవ సాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొ న్నారు.



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## టీడీపీ గ్రామ కమిటీకి నూతన సారథ్యం

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం



పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసేందుకు బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నూతన కమిటీని నియమించారు. బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశాల మేరకు పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కుంచాల సుబ్రహ్మణ్య రెడ్డిలను నియమించారు.గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, పార్టీ శ్రేణులను ఐక్యంగా ముందుకు నడిపించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావడం వంటి బాధ్యతలను నూతన కమిటీ సమర్థవంతంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం సూచించింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు బండారు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కుంచాల సుబ్రహ్మణ్య రెడ్డికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ గ్రామంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా డిమాండ్ల సాధనకు సీపీఐ పాదయాత్ర

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం




అధిక ధరలను నియంత్రించాలని, నిరుద్యోగులకు భృతి కల్పించాలని, రైతులకు లాభసాటి ధరలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో రెండో విడత పాదయాత్ర నిర్వహించారు.ఎర్ర టవళ్ల ముఠా యూనియన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర అంబేద్కర్ విగ్రహం, గడియార స్తంభం, మార్కెట్ సెంటర్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు అందించాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని సింగరకొండ కోరారు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని, రొయ్యల మేత ధరలను తగ్గించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ చేపడుతున్న ఆందోళనలను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరి సంకల్పం అవసరం

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం



దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అనే నేను' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి., ఐఏఎస్ పిలుపునిచ్చారు.2047 నాటికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి వ్యక్తిగా, తమ ప్రాంతంగా, రాష్ట్రంగా, దేశంగా ఎలాంటి అభివృద్ధిని సాధించాలని కోరుకుంటున్నారో ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. దేశాభివృద్ధిలో తాము ఏ విధంగా భాగస్వామ్యం కావాలనుకుంటున్నారో 'అనే నేను' శీర్షికతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు రూపంలో తమ సంకల్పాన్ని వెల్లడించాలని కోరారు.జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కూడా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ స్వచ్ఛందంగా తమ సంకల్పాలను 'అనే నేను' శీర్షికతో సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేయాలని సూచించారు. ప్రజల్లో బాధ్యత, అభివృద్ధి పట్ల భాగస్వామ్య భావన పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ప్రజలు, అధికారులు, సిబ్బంది తమ భవిష్యత్ సంకల్పాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసి దేశ నిర్మాణంలో తమ వంతు పాత్రను చాటాలని కలెక్టర్ కోరారు.

## వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

-జాయింట్ కలెక్టర్ భావన



బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లాలో వక్ఫ్ బోర్డు పరిధిలోని ఆస్తులపై జరిగిన అక్రమాలు, ఆక్రమణలను గుర్తించి తక్షణమే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట అధికారులను ఆదేశించారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడంలో నిర్లక్ష్యం వహించకుండా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన జిల్లా వక్ఫ్ బోర్డు సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఇతరుల పేర్లపై నమోదై ఉన్న ఆస్తులను గుర్తించి, వాటిని వక్ఫ్ బోర్డు పేరుతో నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం జిల్లా వాచ్‌డాగ్ కమిటీ ఆన్ వాటర్ బాడీస్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, కాలువలు తదితర జల వనరులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జల వనరుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ఆక్రమణల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశాల్లో డీఆర్వో లవన్న, ఆర్డీవోలు, ల్యాండ్ సేల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సతీష్, వక్ఫ్ బోర్డు అధికారులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తపాలా ఉత్పత్తులతో బాపట్ల పర్యాటక ప్రచారం

బాపట్ల ఆగస్టు 11వార్త సాక్ష్యం



బాపట్ల జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం కల్పించేందుకు తపాలా శాఖ చేపడుతున్న ప్రచార కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అభినందించారు. 'బే ఆఫ్ బాపట్ల' పేరుతో రూపొందించిన ప్రత్యేక లోగోతో పిక్చర్ పోస్ట్‌కార్డులు, మై స్టాంప్, మీడియా పోస్ట్ వంటి తపాలా ఉత్పత్తుల ద్వారా జిల్లాలోని పర్యాటక ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసిన తెనాలి డివిజన్ తపాలా శాఖ అధికారులు పర్యాటక ప్రచారానికి సంబంధించిన ఉత్పత్తులు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. బాపట్ల పర్యాటక రంగానికి తపాలా శాఖ అందిస్తున్న ప్రచార వేదికలు మంచి ఫలితాలను ఇస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రత్యేకతను ప్రతిబింబించేలా రూపొందించిన తపాలా ఉత్పత్తులను అధికారికంగా ప్రచురించేందుకు, విస్తృత ప్రచారం నిర్వహించేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు.తపాలా శాఖ ద్వారా జారీ చేసే పాస్‌పుస్తకాలు, ధ్రువీకరణ పత్రాలు తదితర ఉత్పత్తులకు అనుమతి ఇవ్వాలని అధికారులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. డీఎన్‌కే అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. భవిష్యత్‌లో నిర్వహించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ, ఇతర వాటాదారుల సమావేశాలకు తపాలా శాఖ ప్రతినిధులను ఆహ్వానిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎస్ఎస్ఏవికె కుమార్, బాపట్ల సబ్‌డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జె. మధుసూదన్, బడి పీఏ సాంబశివరావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శివయ్య శేఖర్, పోస్టుమెన్ జ. నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేలా రైతులకు అవగాహన

గుంటూరు, ఆగస్టు 11వార్త సాక్ష్యం




ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. లాం కృష్ణ ఆడిటోరియంలో జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖల విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు.వాతావరణ మార్పులు, ఎల్‌నినో కారణంగా ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన శాస్త్రీయ పరిజ్ఞానం రైతులకు చేరినప్పుడే దాని ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలు నేరుగా తెలుసుకుని పరిష్కారాలు సూచించాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణను విస్తృతంగా చేపట్టడంతోపాటు ఆధునిక సాగు విధానాలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవడానికి యాంత్రీకరణ కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, పశుసంవర్ధక, మార్క్‌ఫెడ్, ఆత్మ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి ఆదర్శంగా కండక్టర్ అంకమ్మరావు నిజాయితీ



చిలకలూరిపేట ఆగస్టు 11వార్త సాక్ష్యం

విధి నిర్వహణలో నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్న ఆర్టీసీ కండక్టర్ అంకారావు పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. బస్సులో ప్రయాణించిన ఓ మహిళ తొందరపాటులో తన హ్యాండ్ బ్యాగ్‌ను మర్చిపోగా, దానిని గుర్తించిన కండక్టర్ బ్యాగ్‌ను భద్రపరిచి, యజమానిని గుర్తించి సురక్షితంగా ఆమెకు అప్పగించారు. బ్యాగ్‌లో రూ.5 వేల నగదుతో పాటు బంగారు గొలుసు ఉన్నట్లు తెలిసింది. విలువైన వస్తువులు ఉన్న బ్యాగ్‌ను భద్రంగా ఉంచి బాధ్యతగా వ్యవహరించిన కండక్టర్ అంకారావు నిజాయితీని ప్రయాణికులు అభినందించారు. ప్రయాణంలో తొందరపాటుతో విలువైన వస్తువులను మర్చిపోయిన సందర్భంలో వాటిని సొంతం చేసుకోకుండా యజమానిని గుర్తించి తిరిగి అప్పగించడం ఆర్టీసీ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో బాధ్యత, నిజాయితీకి అంకారావు నిదర్శనంగా నిలిచారని ప్రశంసించారు. కండక్టర్ అంకారావు చూపిన నిజాయితీని డిపో మేనేజర్ అభినందించారు. ప్రయాణికుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆర్టీసీ ప్రతిష్టను పెంచేలా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

## పచ్చదనంతో గుంటూరును హరిత నగరంగా మార్చాలి

గుంటూరు, ఆగస్టు 11వార్త సాక్ష్యం



గుంటూరు నగరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ ఎం.డి.నజీనా బేగం పిలుపునిచ్చారు. 'గ్రీన్ గుంటూరు' కార్యక్రమంలో భాగంగా ఆటోనగర్ ఏపీఐఐసీ ప్రాంగణంలో మంగళవారం సామూహిక మొక్కలు నాటారు.ఏపీఐఐసీ గుర్తించిన ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆమె తెలిపారు. పచ్చదనం పెంచడం వల్ల నగరంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడటంతోపాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని చెప్పారు. జిల్లా యంత్రాంగం సూచనల మేరకు ప్రతి ఒక్కరూ కనీసం ఆరు అడుగుల ఎత్తున్న మొక్కలను నాటి వాటితో సెల్ఫీ తీసి పంపించాలని కోరారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గుంటూరు నగరాన్ని హరిత నగరంగా, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

## ఎస్ఐఆర్‌లో 1.68 లక్షల నోటీసులు

గుంటూరు, ఆగస్టు 11వార్త సాక్ష్యం



ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 1,68,218 నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. మంగళవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో నియోజకవర్గాల వారీగా నోటీసుల వివరాలను సమీక్షించారు. తాడికొండలో 24,862, మంగళగిరిలో 29,456, పొన్నూరులో 27,095, తెనాలిలో 4,459, ప్రత్తిపాడులో 19,556, గుంటూరు పశ్చిమలో 30,022, గుంటూరు తూర్పులో 32,768 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు సమర్పించవచ్చని పేర్కొన్నారు. సంబంధిత బీఎల్ఓలు, ఏఈఆర్ఓ, తహసీల్దారు లేదా ఓటర్ల నమోదు అధికారి కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేనివారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం--6తోపాటు సంబంధిత డిక్లరేషన్ సమర్పించాలన్నారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన ధ్రువీకరణ పత్రాల్లో తమ వద్ద ఉన్న ఏదో ఒకదాన్ని సమర్పించాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై సెప్టెంబర్ 27లోపు నిర్ణయం తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

VARTHAA SAKSHAMU · వార్త సాక్ష్యం · తెలుగు దిన పత్రిక · Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు
## బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక




కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతా యుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.

## ఎలక్ట్రిక్ టూవీలర్లకు గుడ్‌న్యూస్: సబ్సిడీ గడువు పొడిగింపు



ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్‌హాన్స్‌మెంట్' (పీఎం ఈ-డ్రైవ్) పథకం కింద అందిస్తున్న కొనుగోలు ప్రోత్సాహకాలను 2028 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో ద్విచక్ర వాహన విభాగానికి కేటాయించే నిధులను కూడా భారీగా పెంచింది. ఈ మేరకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆగస్టు 10న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం, 2025 ఏప్రిల్ 1 నుంచి 2028 మార్చి 31 మధ్య విక్రయించే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా కిలోవాట్ అవర్‌కు రూ. 2,500 చొప్పున ప్రోత్సాహకం లభిస్తుంది. అయితే, ఒక్కో వాహనంపై గరిష్ఠంగా రూ.5,000 వరకు మాత్రమే రాయితీని పరిమితం చేశారు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రోత్సాహకం కిలోవాట్ అవర్‌కు రూ. 5,000 ఉండగా, గరిష్ఠ పరిమితి రూ. 10,000గా ఉంది. కేవలం రూ. 1.5 లక్షల ఎక్స్-ఫ్యాక్టరీ ధర లోపు ఉన్న వాహనాలకు మాత్రమే ఈ సబ్సిడీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగానికి కేటాయించిన నిధులు రూ. 1,772 కోట్ల నుంచి రూ. 2,767 కోట్లకు పెరిగాయి. ఈ నిధుల ద్వారా సుమారు 45.79 లక్షల రిజిస్టర్డ్ ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. పథకం మొత్తం కేటాయి ంపులు కూడా రూ. 11,900 కోట్లకు చేరాయి. రాయితీ క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి 2027 డిసెంబర్ 31ని తుది గడువుగా నిర్ణయించారు. అయితే, కేటాయించిన నిధులు నిర్ణీత గడువు కంటే ముందే ఖర్చయితే, ఆ తర్వాత ఎటువంటి క్లెయిమ్ లను స్వీకరించబోమని ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా 2024 సెప్టెంబర్‌లో పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని ప్రారంభి ంచారు. ఈ పథకం గడువును, నిధులను పెంచాలని ఇటీవల రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రం నిర్ణయంతో ఏథర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ వంటి కంపెనీల షేర్లు లాభాల్లో పయనించాయి. ఈ పొడిగి ంపు అటు తయారీదా రులకు, ఇటు కొనుగో లుదారులకు దీర్ఘకాలిక భరోసా కల్పిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

## 1601 నంబరు సిరీస్




**న్యూఢిల్లీ:** అవాం ఛిత కాల్స్‌ను కట్టడి చేసే చర్యల్లో భాగంగా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎ?ఫఎ?సఐ), ప్రభుత్వ రంగాలు కాకుండా ఇతర రంగాల సంస్థలు చేసే లావాదేవీ, సేవా సంబంధిత కాల్స్ కోసం ప్రత్యేకంగా 1601 నంబరు సిర?సను వాడాలని సోమవారం ఆదేశించింది. ఈ మేరకు తొలి దశలో యుటిలిటీస్ (వినియోగ సేవలు), కొరియర్, లాజిస్టిక్స్ రంగాల సంస్థల సర్వీస్, లావాదేవీ కాల్స్‌ను 1601 నంబరు సిరీస్ పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తెలిపింది. అయితే ఈ సిరీస్‌ను ఏ సంస్థ కూడా ప్రచార సంబంధిత వాయిస్ కాల్స్ కోసం వాడరాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం బీఎ?ఫఎ?సఐ రంగంతోపాటు ప్రభుత్వ సంస్థల సర్వీసు, లావాదేవీ కాల్స్ కోసం 1600 సిరీస్ నంబర్లను కేటాయిం చారు. ఈ సంస్థల కమ్యూ నికేషన్లు చాలా కీలకమైనవి, సున్నితమైనవి కావడంతో వాటికి సంబం ధించిన ముఖ్యమైన లావా దేవీల కాల్స్ ఇతర రంగాల సేవా కాల్స్‌తో కలిసి పోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఇతర రంగాల కోసం ప్రత్యేకంగా 1601 సిర?సను జారీ చేసినట్లు ట్రాయ్ పేర్కొంది. బీఎ? ఫఎ?సఐ సంస్థలు 1600 సిర?సను విస్తృతంగా వాడిన అనుభవం ఆధారంగా ఇతర రంగాలకు కూడా అదే తరహా నంబరింగ్ విధానాన్ని విస్తరిం చాలని ట్రాయ్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీఎఫ్ఎ?సఐ, ప్రభుత్వ రంగాలు కాకుండా ఇతర రంగాల సంస్థలు చేసే కాల్స్ కోసం టెలికాం శాఖ కేటాయించిన 1601 సిరీస్‌ను దశల వారీగా అమలుకు శ్రీకారం చుట్టినట్లు ట్రాయ్ తెలిపింది.

# స్పోర్ట్స్

## శ్రీలంకకు షాకిచ్చేందుకు గిల్-గంభీర్ మాస్టర్‌ప్లాన్
## ప్రాక్టీస్‌లోనే ప్రణాళికలు అమలు!




శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు.. స్పిన్‌తో పాటు పేసర్ల నుంచి ఎదురయ్యే ముప్పుపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ప్రాక్టీస్ చేయాలని భావించింది. ఎన్‌సీసీ మైదానంలో ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌ను.. శ్రీలంక 'ఎలెవన్'తో జరిగిన వార్మప్ మ్యాచ్ పిచ్ తరహాలో సిద్ధం చేయాలని గ్రౌండ్ సిబ్బందికి సూచించింది. పిచ్‌పై పగుళ్లు వచ్చేలా చేసి.. నాలుగో రోజు వికెట్‌ను పోలిన పరిస్థితులు కల్పించారు. బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారత బ్యాటర్లు ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా సాధన చేశారు. నెట్ సెషన్‌లో గిల్ ముగ్గురు త్రో-డౌన్ నిపుణుల నుంచి బంతులు ఎదుర్కొన్నాడు. పాత, కొత్త కూకాబుర్రా బంతులతో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేలా సాధన చేశాడు. అనంతరం అకీబ్ నబీ నుంచి సెమీ-ఓల్డ్ బంతులతో బౌలింగ్ చేయించుకుని మరింత ప్రాక్టీస్ చేశాడు. గాలె పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూ లంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడు తుందని.. దీంతో రివర్స్ స్వింగ్ కీలకంగా మారొచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది. భారత్ ఇప్పటికే శ్రీలంక 'ఎలెవన్'పై మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడింది. శ్రీలంక మాత్రం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండానే సిరీస్‌లోకి దిగుతోందని మాజీ పేసర్ ఫర్వీజ్ మహరూఫ్ తెలిపారు. భారత బ్యాటింగ్‌పై సందేహాలు ఉన్నా.. సిరీస్‌కు ఆతిథ్య జట్టు కంటే భారత్ మెరుగ్గా సిద్ధమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారత ఆటగాళ్లను 'చీటర్స్' అన్న సంగక్కం- ఏళ్ల తర్వాత బయటపెట్టిన ఇర్ఫాన్ పఠాన్



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్, శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కర మధ్య మైదానంలో జరిగిన ఓ తీవ్ర వాగ్వాదాన్ని ఏళ్ల తర్వాత బయటపెట్టాడు. 2005లో జరిగిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో సంగక్కర తనను, భారత ఆటగాళ్లను 'మోసగాళ్లు (చీటర్స్)' అని పిలుస్తూ వ్యక్తిగత దూషణలకు దిగాడని పఠాన్ సంచలన విషయాలు వెల్లడించాడు. అయితే, ఆ తర్వాత ఐపీఎల్ పుణ్యమా అని ఇద్దరూ మళ్లీ కలిసిపోయి మంచి స్నేహితులుగా మారినట్లు కూడా తెలిపాడు.

**-అసలేం జరిగిందంటే..!**

2005లో శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ మధ్యలో బంతుల బాక్సును మార్చడంపై శ్రీలంక ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా సంగక్కర దీనిపై చాలా ఆగ్రహంగా ఉన్నాడు. అదే సమయంలో జట్టు యాజమాన్యం కోరిక మేరకు ఇర్ఫాన్ పఠాన్ ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు. ఈ వివాదం గురించి తనకు ఏమాత్రం తెలియదని పఠాన్ పేర్కొన్నాడు. "నేను ఓపెనర్‌గా బరిలోకి దిగి 93 పరుగులు చేశాను. ఆ ఇన్నింగ్స్‌లో ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు కొట్టాను. కొత్త బంతితో మురళీధరన్‌ను సిక్సర్లు కొట్టడమంటే ప్రత్యర్థి ప్రణాళికలను దెబ్బతీసినట్లే. అది చూసి సంగక్కర అకస్మాత్తుగా స్లెడ్జింగ్ మొదలు పెట్టాడు. 'మీరు మోసగాళ్లు, మీ తల్లిదండ్రులు మీకు ఇవే నేర్పిస్తారా' అంటూ వ్యక్తిగత దూషణలకు దిగాడు. అతను వ్యక్తిగతంగా మాట్లాడటంతో నేను కూడా గట్టిగానే సమాధానం ఇచ్చాను. కానీ, గొడవ మొదలుపెట్టింది అతనే" అని పఠాన్ ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నాడు.

## లైంగిక దాడి ఆరోపణలు
## ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్




ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్ అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, బెదిరింపులకు గురిచేశాడని ఓ మెడికల్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కలకత్తా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. హూగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. డమ్ డమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామీ సిటీలో అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఓ మెడికల్ విద్యార్థిని అభిషేక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత మూడేళ్లుగా తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, గత ఏడాది నుంచి అభిషేక్ తనను దూరం పెడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి పలుమార్లు లైంగిక సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. అంతేకాకుండా తనపై దాడి చేసి, తీవ్రంగా బెదిరించాడని కూడా ఫిర్యాదులో తెలిపింది. ఈ కేసులో అభిషేక్‌ను అరెస్ట్ చేయాలని కలకత్తా హైకోర్టు పోలీసులను ఆదేశించింది. గతంలో అభిషేక్ ఈ ఆరోపణలన్నింటినీ ఖండించాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన పోరెల్, 2023 నుంచి ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. బెంగాల్ తరఫున ఫస్ట్-క్లాస్, లిస్ట్ ఏ మ్యాచ్‌లతో పాటు ఇండియా-ఏ జట్టు తరఫున కూడా ఆడాడు.

VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక



## ఉదయనిధి వ్యాఖ్యల దుమారం.. త్రిష వరుస పోస్టులు వైరల్!



తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా.. వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది. మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి. "ఒకప్పుడు కోరుకున్న జీవితంతో ఇప్పుడు ఉక్కిరిబిక్కిరవడం ఎంత గొప్ప అదృష్టం" అంటూ మరో పోస్ట్‌ను త్రిష షేర్ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ ఉదయనిధిని ఉద్దేశించేనా? అన్న దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు.



ఇటీవల కావేరీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిష పేరుతో నినాదాలు రావడంతో ఆయన చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్రిష తాజా పోస్టులు చర్చనీయాంశంగా మారాయి.

## ఆయనో నక్క.. నేను మాత్రం విశ్వాసమున్న కుక్కను: కంగనా ఘాటు వ్యాఖ్యలు!



బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది. ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. "నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు" అని కంగనా రాసుకొచ్చారు. ఆయన్ను ఓ 'నక్క' (లోమ్డీ) అని అభివర్ణించిన కంగనా, తాను మాత్రం విశ్వాసపాత్రమైన కుక్కగా ఉండటానికే ఇష్టపడతానని స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించినప్పుడు నసీరుద్దీన్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నోట్లో ఎముక ఉన్న కుక్క మొరగదు. ఆ ఎముక కిందపడగానే లేదా పళ్లు విరగ్గొట్టగానే అప్పుడు మొరుగుతుంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పియూష్ మిశ్రా మాట్లాడుతూ, షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు ఏ 'కుక్కలు' మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వార్తను షేర్ చేస్తూనే కంగనా నసీరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు. గతంలో కూడా కంగనా విద్యార్థుల ఉద్యమాలను విమర్శిస్తూ, యువతలో ఒక వర్గాన్ని 'గట్టర్ చాప్' అని సంబోధించి వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.



# వివాదంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్

## యువతి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువనని చెప్పి, తనను బెదిరిం చారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు. యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## 'హృదయం మురళి' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

అధర్వ హీరోగా రూపొందిన సినిమానే 'ఇదయం మురళి' (హృదయం మురళి). అధర్వ తండ్రి మురళి హీరోగా 1991లో 'ఇదయం' (హృదయం) సినిమా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ సినిమా మ్యూజికల్ హిట్ గా యూత్ ను ఒక ఊపు ఊపేసింది. ఆ సినిమా పేరును .. తండ్రి పేరును కలుపుతూ, ఆయనను గుర్తుచేస్తూ అధర్వ ఈ సినిమా చేశాడనుకోవాలి. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 7వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో తెలుగులోను స్ట్రీమింగ్ అవుతోంది. 'హృదయ' (అధర్వ) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతాడు. అప్పటి నుంచి మేనమామ (నట్టి సుబ్రమణ్యం) అతని ఆలనాపాలన చూస్తూ వస్తాడు. అయితే తల్లిదండ్రులు లేని కారణంగా ఒక రకమైన బెరుకు 'హృదయ'లో ఉండిపోతుంది. ఆ కారణంగా అతను తన మనసులోని మాటను బయటికి చెప్పలేకపోతుంటాడు. కాలేజ్ లో చదువుకునే రోజులలో అతను 'సమంత' (ప్రీతి ముకుందన్)ను ప్రేమిస్తాడు. కానీ ఆ ప్రేమను మనసులోనే దాచుకుంటాడు. ఆ తరువాత చదువు పూర్తి చేసి చెన్నైలో జాబ్ కోసం సెర్చ్ చేస్తూ ఉంటాడు. ఆ సమయంలోనే అతనికి 'అముద' (కయాదు లోహార్) పరిచయమవుతుంది. డాక్టర్ గా ఉన్న ఆమెను అతను ఆరాధించడం మొదలుపెడతాడు. ఆమె పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేయమని స్నేహితులు ఎంతగా చెప్పినా, హృదయ ధైర్యం చేయలేకపోతాడు. ఆమె తన ఊరికి వెళ్లిపోవడంతో దిగాలు పడిపోతాడు. సమంతకుగానీ .. అముదకుగాని తన మనసులోని ప్రేమను చెబితే బాగుండునని అనుకుంటాడు. 'అదితి'తో హృదయ ఎంగేజ్ మెంట్ జరిగిన తరువాత వాళ్లిద్దరూ తారసపడతారు. అప్పుడు అతను ఏం చేస్తాడు? అనేదే కథ.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.